
గుడిమల్కాపూర్‌లో పూల అమ్మకాలు


గుమ్మడికాయల అమ్మకాలు

మార్కెట్లకు దీపావళి శోభ

గోల్కొండ: దీపావళి సందడి నెలకొంది. దీపావళికి అవసరమైన పూజా సామగ్రి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. పూజలకు అవసరమైయ్యే పూలు భారీ ఎత్తున గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు తరలివచ్చాయి. పూల రైతులు తాము పండించిన పూలను డీసీఎంలలో తెచ్చి రేతిబౌలి నుంచి కార్వాన్ మోగల్ కా నాలా రోడ్డుపై అమ్ముతున్నారు. పూల దిగుబడి బాగుండడంతో పూల రేట్లు కూడా అందరికీ అందుబాటులో ఉండే విధంగానే ఉన్నాయి. మరో వైపు అరటి, చెరుకు గడలు, బూడిద గుమ్మడి కాయలు కూడా బాగు అమ్ముతున్నాయి. పూజలకు అవసరమైయ్యే దివ్వెలు కూడా బాగు అమ్ముడవుతున్నాయి.

నిత్యాన్నదానం ప్రారంభం

మణికొండ: పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు పుప్పాలగూడకు చెందిన కస్తూరి రాములు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో రాకేష్ తివారీ, బాలీవుడ్ సింగర్ అనురాధా పాడ్వాల్ తదితరులు

చార్మినార్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో నరక చతుర్ధశి పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఆరు రోజుల పాటు జరిగే వేడుకలను పురస్కరించుకుని రెండో రోజైన ఆదివారం ఉదయం 7 గంటలకు భక్తులకు మొదటి దర్శనం కల్పించారు. అర్ధరాత్రి 11.30 గంటల వరకు నిరంతరాయంగా భక్తులు భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 23వ తేదీతో వేడుకలు పూర్తి కానున్నాయి. వేడుకల్లో భాగంగా సుల్తాన్‌షాహీ జగదాండ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారీతో పాటు ప్రముఖ బాలీవుడ్ గాయకురాలు అనురాధా పాడ్వాల్ తదితరులు ఆలయాన్ని సందర్శించి భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

సదర్ ఉత్సవాలు నగర సంస్కృతికి ప్రతీక


టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో సత్యనారాయణ తదితరులు

గోల్కొండ: సదర్ ఉత్సవాలు నగర సంస్కృతిలో ఒక భాగమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యాదవ కులస్తులు తమ కుల దైవమైన దున్నలకు పూజించే ఉత్సవమే సదర్ అని అన్నారు. షేక్‌పేట్‌లో జరిగే సదర్ ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించాలని తాను స్వయంగా అక్కడ జరిగే సదర్ వేడుకలకు హాజరవుతానని ఆయన అన్నారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులున్నారు.

'అందరికీ అందుబాటులో ఉంటా'



గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల వల్ల పేద బడుగు వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రెండేళ్ల నుంచి ఎందరో పేదలకు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి చేకూరిందన్నారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనను దీవించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, కె.దయానంద్ తదితరులున్నారు.

జూబ్లీహిల్స్ బరిలో ప్రజా ఏక్తాపార్టీ



అఫ్జల్‌గంజ్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో ప్రజా ఏక్తా పార్టీ బరిలో నిలిచిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జె.వినాయతకు టికెట్ డిక్లరేషన్ చేసి బీ-ఫాం అందజేసినట్లు ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్‌లో జరగబోయే ఉప ఎన్నికల్లో సెంటిమెంట్, సమస్యలపై పోరాటం జరుగుతుందని పార్టీలకు అతీతంగా సమస్యలపై పోరాడే నాయకుల మీద స్థానిక ప్రజలకు పూర్తి అవగాహన ఉందని రాబోయే ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనంగా నిలుస్తాయని ఆయన తెలిపారు.

చాదర్ అందజేత


చాదర్‌ను అందజేస్తున్న బిహార్ గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్

చార్మినార్: ఆగ్రాలోని ఖాజీ సయ్యద్ నురాల్లా షుస్తారి (షాహిద్-ఈ-సాలీస్) దర్గాకు సమర్పించనున్న చాదర్‌ను బిహార్ గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్, పాతబస్తీ దారుషిఫాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీకి అందజేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరపున గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్ తనకు అప్పగించిన ఈ బాధ్యతను పూర్తి చేస్తానన్నారు. ఈ చాదర్‌ను షాహిద్-ఈ-సాలీస్ దర్గాకు అందజేయనున్నట్లు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి సహజీవనం చేస్తున్నారని..ఎన్నో ఏళ్లుగా దర్గాలకు చాదర్‌లను భక్తి శ్రద్ధలతో అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ తాహిర్ రజా, సంజార్ ఇమాం తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా స్టాళ్లకు అనుమతులు తప్పనిసరి

గోల్కొండ: బాణాసంచా స్టాళ్లఏర్పాటు చేసే వారు అన్ని రకాల అనుమతులు ముందుగానే పొంది ఉండాలని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం ఆయన బాణాసంచా స్టాల్స్ ఏర్పాటుపై వివరించారు. బాణాసంచా స్టాళ్ల ఏర్పాటుకు ముందుగా పోలీసుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏర్పాటు చేసే స్థలం సురక్షిత ప్రాంతంలో ఉండాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ఆయన పలు సూచనలు చేశారు.

అలరించిన కృష్ణభక్తి నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం నృత్య ప్రియ డ్యాన్స్ అకాడమీ 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జీవితం నుంచి ఎన్నో ఘట్టాలను కథన శైలీలో, నృత్య రూపకాలలో ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కళాత్మకతతో నిండి భక్తి శైలితో అలంకరించడంతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుభూతిని కలిగించారు. శాస్త్రీయ నృత్యాన్ని ప్రోత్సహిస్తూ యువ కళాకారులను ప్రేరేపించడంపై పలువురు వక్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌బీఎల్ చీఫ్ అజితేష్ రెడ్డి, కళాదర్శకురాలు స్వప్న కృష్ణమోహన్, ఉష గాయత్రి, కె.మంజుల, వాణీరమణ తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో తేజస్‌కు స్వర్ణం



బంగారు పతకం అందుకున్న తేజస్

జియాగూడ: అండర్-17 రైఫిల్ షూటింగ్ కమ్ సెలక్షన్ విభాగంలో జియాగూడకు చెందిన దర్శల్లి తేజస్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ విజయ్ శేఖర్, ఫిజికల్ డైరెక్టర్ అంబుజ్ పురానిక్‌ల చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఇంటర్‌స్కూల్ డిస్ట్రిక్ట్ లెవెల్ రైఫిల్ షూటింగ్ పోటీలు నాంపల్లిలోని మదీనా పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల జరిగాయి. కోచ్ అల్లూరి ప్రసన్న కుమార్, సెక్షన్ సెక్రెటరి జోసెఫ్ జోనాల్డ్, ఫిజికల్ డైరెక్టర్స్ జీవనజ్యోతి, రంజిత, కోచ్‌లు సయ్యద్ హుస్సేన్, సహస్ర శ్రీస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల అందజేత

మణికొండ: వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన కాలనీలో వాచ్‌మెన్లు, పని మనుషులు, మున్సిపల్ కార్మికులకు ఆర్థిక సాయంతో పాటు దుస్తులు అందించారు. నక్షత్ర గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు డి.సీతారాం, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వి.బాల్‌రెడ్డి హాజరై పంపిణీ చేశారు. వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు కె. ధన్‌రాజ్, జి.నరేందర్, ఎ.లక్ష్మన్‌రావు, సుజాత పాల్గొన్నారు.